# పునాది

## కోరుకొండ సత్యానంద్

నా చిన్నతనంలో ఈ ప్రదేశం నిర్మానుష్యంగా ఉండేది. అందుకే నేను హాయిగా పెరిగాను. చక్కని గాలి, వెలుతురు... వీటితో నేను చాలా ఆరోగ్యంగా, అందంగా పెరిగాను.

కానీ ఈ మధ్య ఈ ప్రదేశానికి కొద్ది దూరంలో కొన్ని గుడిసెలు వెలిశాయి. ఆ గుడిసెల్లో ఉన్న పిల్లలు ఉదయమో, సాయంత్రమో ఈ ప్రదేశానికి రావడం మొదలుపెట్టారు. ఆ పిల్లల మాటలు వింటుంటే, వాళ్ళ కేరింతలు చూస్తుంటే నాకు చాలా ముచ్చటగా ఉండేది. ఆడుకుంటూ, నవ్వుకుంటూ, కేరింతలు కొడుతూ ఈ ప్రదేశంలో తిరిగే పిల్లలు ఓ రోజు నన్ను చూశారు. చూసి నా దగ్గరకు వచ్చారు. కాసేపు నా దగ్గర కూర్చున్నారు. రకరకాల ఆటలు ఆడుకున్నారు. నన్ను పట్టుకొని నా చుట్టూ తిరుగుతూ వాళ్ళలా ఆడుతుంటే నాలో ఏదో కొత్త అనుభూతి కలిగేది.

కానీ ఆ అనుభూతి ఎన్నాళ్ళో మిగల్లేదు నాకు. ఆ విచిత్రమైన అనుభూతి స్థానే భయం, కోపం, దుఃఖం ముంచుకొచ్చాయి. ఎందుకంటే ఆటలాడుతున్న ఆ పిల్లల్లో ఓ తుంటరి కుర్రవాడు ఓ రాయి తీసి నన్ను కొట్టాడు. మిగతా పిల్లలంతా ఆ కుర్రవాడు చేస్తున్నది తప్పని వారిస్తా రనుకున్నాను గానీ, ఆ కుర్రవాడితో పాటూ మిగతా వాళ్ళంతా తలా ఓ రాయి తీసుకొని నన్ను కొట్టడం మొదలుపెట్టారు.

అలా ఎన్ని రోజులో ఆ చిత్రహింస అనుభవించలేదు.

కానీ ఒక రోజు షరా మామూలుగా ఆ పిల్లలు నన్ను కొడుతుంటే... "ఏయ్, ఆగండి!" అన్న మాట వినిపించింది.

నేను అటువైపు చూశాను. ఓ ముప్ఫై అయిదేళ్ళ వ్యక్తి... అతని పక్కన ఒకామె, ఆమె పక్కన ఇద్దరు పిల్లలు, ఆమె చంకలో ఓ పాప ఉన్నారు. ఆ పిల్లల్ని చూసి నేను మళ్ళీ ముచ్చట పడబోయాను గానీ... రోజూ వచ్చే పిల్లలు చేసే పనులు గుర్తొచ్చి, ఈ పిల్లలు కూడా అలాంటి వాళ్ళే అయ్యుంటారని అనిపించింది నాకు.

అతను నా చుట్టూ రాళ్ళు పట్టుకొని నిల్చున్న పిల్లల దగ్గరకు వచ్చి "రేయ్, ఎందుకురా రాళ్ళతో కొడతారు? నే నీ రోజు నుంచి ఇక్కడే ఉంటాను. ఎవరైనా రాళ్ళు విసిరితే కాళ్ళు విరగ్గొట్టి కట్టేస్తాను జాగ్రత్త!" ఉరిమినట్టుగా అన్నాడు.

ఆ మాటలకు నాకు చాలా సంతోషమూ కలిగింది. అత నన్న మాటలకు బిక్కమొహాలు వేసుకొని చూస్తున్న ఆ పిల్లల్ని చూస్తుంటే ఎందుకో జాలి కూడా వేసింది.

ఓ మూడు రోజులకి అతను, ఆమె కలిసి చిన్న గుడిసె వేసుకున్నారు. నాకు కొద్ది దూరంలో... నన్ను రక్షించడానికి ఆ భగవంతుడే వీళ్ళను ఇక్కడకు పంపించాడని అనుకున్నాను నేను.

ఆ రోజు సాయంత్రం... "ఆ బాబు దయ వల్ల అతని స్థలంలో గుడిసె వేసుకోగలిగాం. ఉండడానికి గూడు సమకూరింది, ఇక బ్రతకడానికి తిండి కావాలిగా? రే పెళ్ళి ఎక్కడో చోట పని చూసుకుంటాను" అన్నాడు.

ఆ మర్నాడు ఉదయమే అతను బయటకు వెళ్ళిపోయాడు. మళ్ళీ సాయంత్రం వచ్చాడు. అతను భార్యతో మాట్లాడుతున్న మాటల్ని బట్టి పని దొరికిందని నాకు అర్థమైంది.

ఉదయం అతను వెళ్ళిపోవడం, ఆ పిల్లల్లో పెద్దవాడు ఇంటి దగ్గరే చదువుకోవడం, ఆమె ఇంటి పనులు చేసుకోవడం, రెండో పిల్లవాడి ముద్దు మాటలు, చంటిపిల్ల బోసి నవ్వులు... చూస్తూ నేను కాలాన్ని హాయిగా గడుపుతున్నాను.

కొద్ది రోజుల తర్వాత వాకిట్లో మంచం మీద నీరసంగా జారగిలబడిపోయి నిరుత్సాహంగా అతను భార్యతో మాట్లాడిన మాటలు విన్న నాకు బాధ కలిగింది.

"...లక్ష్మీ మా కాంట్రాక్టరు బట్వాడా అడిగితే అతనికి నష్టం వచ్చిందని చేతు లెత్తేస్తున్నాడు. మరోచోట చూసుకుందా మంటే ఎక్కడా పని దొరకడంలేదు. ఏం చెయ్యాలో బోధపడడంలేదు"

"అలా దిగులు పడకండీ... మనం ఎలాగోలా ఉండగలం కానీ పిల్లలకి ఏం పెడతాం, వాళ్ళు ఆకలని ఏడిస్తే ఏం చెప్పి వాళ్ళని ఊరుకో పెడతాం?"

అలా అంటున్నప్పుడు అతని గొంతు విన్న నేనూ అదోలా అయిపోయాను. ఆ రాత్రి వాళ్ళు ఏమీ తిన్నట్టు లేదు.

మర్నాడు కూడా వాళ్ళు ఏమీ తినలేదు. పిల్లలకి ఏమీ పెట్టలేదు. మధ్యాహ్నం దాకా ఎలాగో ఊరుకోబెట్టగలిగారు గానీ ఆ తర్వాత మాత్రం వాళ్ళని పట్టుకోలేకపోయారు. ఆకలితో ఒకటే ఏడుపు పిల్లలు... చంటిపిల్లవాడికి స్తన్యాన్నందించి ఆమె కన్నీరు పెట్టుకుంది.

ఆ దృశ్యానికి నేను చలించిపోయాను.

ఏమీ చేయలేని వాడిలాగా అంతవరకూ అలా కూర్చుండిపోయిన అతను ఏమనుకున్నాడో ఏమో ఒక్కుదుటున పైకి లేచాడు. అత నెక్కడికో వెళ్తున్నాడని అనుకున్నాను గానీ అతను నా వైపే చూస్తున్నాడు.

మరో పది నిముషాల్లో వాళ్ళందరి ఆకలీ తీరింది. ఆ తర్వాత అతను నా దగ్గరకు ఓ బుట్ట పట్టుకొచ్చాడు. నా కొమ్మల మీదకు ఎక్కి కాయలు కోసి బుట్ట నింపాడు.


నా కొమ్మల మీద నుంచి దిగిపోయిన తర్వాత భార్యను పిలిచి "ఇక్కడ దగ్గర్లోనే రై లాగుతుంది కదా, రైల్లో వీటిని అమ్మి డబ్బు తెస్తాను" అని అతను వెళ్ళిపోయాడు.

అప్పుడు పిల్లలు రాళ్ళతో కొడుతున్నప్పుడు కలిగే బాధ రోజూ అతను నా కాయల్ని కోస్తుంటే కలిగేది కాదు. అందరి ఆకలి నా వల్ల తీరుతున్నందుకు స్తన్యాన్ని చంటిపిల్లవాడు ఆకలితో ఆబగా పీలుస్తున్నప్పుడు కలిగే అనుభూతే నాలోనూ కలిగింది.

కాలం గడుస్తోంది.

వాళ్ళ జీవితంలోనూ మా ర్పొచ్చింది. మొదట్లో నా మీద ఆధారపడి సంపాదించిన డబ్బుతో చిన్న





చిన్న వ్యాపారాలు చేసి మరికొంచెం సంపాదించాడు. ఆ తర్వాత నే నున్న స్థలం యజమాని ఇతని మీద అభిమానంతో చాలా తక్కువకి అమ్మేశాడు. అతని అదృష్టమో, మరేమో ఈ స్థలం అతని సొంతమైన కొద్ది నెలల్లోనే ఇక్కడికి దగ్గర్లో ఓ ఫ్యాక్టరీ వెలవడంతో ఈ స్థలానికి గిరాకీ పెరిగింది. కొంత స్థలాన్ని అమ్మేసి కొంత స్థలంలో ఇల్లు కట్టాడు. సగం ఇల్లు అద్దె కిచ్చి సగం ఇంట్లో వాళ్ళుండేవారు. అతని వ్యాపారాలు అభివృద్ధి చెందడం, ఆ కంపెనీలో కొన్ని కాంట్రాక్టు పనులు చేయడం, అత నలా అభివృద్ధి చెందడం, ఒకప్పుడు బంజరులా ఉండే ఈ స్థలం ఓ అందమైన కాలనీగా రూపుదిద్దుకోవడం అన్నీ నా కళ్ళ ముందే చకచకా జరిగిపోయాయి.

నడుస్తున్న కాలంతో పాటూ అతని పిల్లలూ పెరిగి పెద్దవా రయ్యారు. పెళ్ళీడు కొచ్చిన కూతుర్ని ఘనంగా పెళ్ళి చేసి పంపాడు. మగపిల్లలిద్దరూ కూడా వ్యాపారాల్లో స్థిరపడ్డారు. వాళ్ళకి కూడా పెళ్ళిళ్ళై ఆ ఇంటికి కుందనపు బొమ్మల్లాంటి ఇద్దరు కోడళ్ళు వచ్చారు.

అతనూ పెద్దవా డవుతున్నాడు. నేనూ ముసలిదా న్నైపోతున్నాను. అయినా నా కళ్ళ ముందు పెరిగి పెద్దదైన ఆ సంసారాన్ని ముచ్చటగా చూస్తూ సంతృప్తిగా కాలాన్ని గడుపుతున్నాను.

అలాంటి తరుణంలో ఓ రోజు... నా మొదట్లో కుర్చీ వేసుకొని కూర్చున్న అతని దగ్గరకు అతని కొడుకులు వచ్చారు.

"నాన్నా తమ్ముడూ, నేనూ ఓ పని చేద్దామనుకుంటున్నాం, మీరు కాదనగూడదు"

"ఏమిట్రా?"

"మా వ్యాపారాల్లో వచ్చిన లాభాలతో చెరో ఇంటినీ కట్టుకుందా మనుకుంటున్నాం"

"అలాగే... మీరు చేసేది మంచి పనే కదా?. అందుకు నే నెందుకు అభ్యంతరం చెప్తాను? స్థలం ఎక్కడైనా అమ్మకాని కుందా?"

"ఈ స్థలం ఉండగా మరెక్కడో మళ్ళీ కొనడం ఎందుకు నాన్నా?"

"ఇక్కడా? ఇక్క డెందుకురా? ఈ ఇంటికి ఈ ఖాళీ స్థలం ఉంటేనే బాగుంటుంది కదా? మీరూ ఆలోచించండి"

"బాగానే ఉంటుంది నాన్నా. కానీ ఇక్క డైతేనే అద్దెలు ఎక్కువ వస్తాయి. మనందరం ఓ పోర్షన్లో ఉన్నా మిగతా మూడు పోర్షన్లూ అద్దె కిచ్చేస్తే ఆదాయం బాగుంటుంది కదా అని మా ఆలోచన"

"ఆలోచన మంచిదే. కానీ మిగిలిన ఈ స్థలంలో రెండు పోర్షన్లేం అవుతాయిరా. ఈ చెట్టు కోసం పదడుగుల స్థలం వదలాలి కదా?"

"ఎందుకు నాన్నా స్థలం వదలటం?"

"వదలకపోయినా ఈ స్థలంలో రెండు పోర్షన్లేం అవుతాయని?"

"చెట్టు దాటాక కూడా మనకి ఓ పది అడుగుల వరకూ స్థలం ఉంది కదు నాన్నా. ఈ చెట్టుని కొట్టేస్తే రెండు పోర్షన్లు బ్రహ్మాండంగా అవుతాయి కదా?"

ఆ మాటలు విన్నా నేను ఒక్కసారిగా నీరుగారిపోయాను. పుట్టి పెరిగి కొద్ది రోజుల పాటు రాళ్ళ దెబ్బలు తిన్నా నేమో గానీ ఎప్పుడూ గొడ్డలి వేటు, నెరగని నాకు ఆ మాటలు గొడ్డలివేట్ల లాగా అనిపించి తట్టుకోలేకపోయాను. కాసేపటికి తేరుకుని అత నేమంటాడోనని చూశాను.

అతనేమీ మాట్లాడలేదు...."సరే మీ ఇష్టం!" అని అనేస్తాడేమో అనుకున్నాను గానీ అతనలా అనలేదు.

"ఒరేయ్, మీకు గుర్తుందో లేదో నాకు తెలీదు కానీ, మీతో, మీ అమ్మతో కలసి గంగలో దూకేసి ప్రాణాలు తీసుకొనే పరిస్థితి వచ్చిన రోజున ఇదేరా, ఈ చెట్టేరా మనల్ని నిలబెట్టింది. ఆకలితో మీరు ఆగకుండా ఏడుస్తున్నప్పుడు దీని కాయలతో మీ ఆకలినీ, మా ఆర్తినీ తీర్చింది ఈ చెట్టేరా! మన కిప్పుడు ఏర్పడిన ఈ మాత్రం అంతస్తుకు ఒకప్పుడు పునాదై నిలిచింది ఈ చెట్టేరా! అలాంటి చెట్టు ఈ రోజు మన ఆదాయానికి అడ్డొస్తుందని అంటున్న మీ మాటలు వింటుంటే నా కడుపులో దేవుతు న్నట్టనిపిస్తుందిరా! మిమ్మల్ని కని, పెంచిన నన్నూ, మీ అమ్మనీ మీ చేతులతో హత్య చేయగలిగే రాక్షసత్వం మీలో ఎదిగితే, ఈ చెట్టు మొదట్లో మే మిద్దరం నిలబడతాం. చెరో గొడ్డలీ తీసుకొని మా మెడల మీద చెరో వేటూ వేసి ఆ తర్వాత ఈ చెట్టును నరికేయండ్రా!" అతను ఆయాసంతో ఆగాడు.

"నాన్నా!"

"అవున్రా! ఆకలితో మలమల మాడిపోయే నా కుటుంబాన్ని నిలబెట్టిన ఈ చెట్టు పడిపోవడం మేం బ్రతికుండగా చూడలేంరా... ఈ కట్టెలు కాలిపోయాకే ఈ చెట్టు కూలిపోవాలి... అంతే!"

ఆ ఇద్దరు కొడుకులూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

ఆ తర్వాత..."నాన్నా... మమ్మల్ని క్షమించండి. మీరు ఇంత బాధపడతారని క్షణం ఏమాత్రం ఊహించి ఉన్నా మీతో అలా అని ఉండేవాళ్ళం కాదు" అని అతని పెద్ద కొడుకు అక్కడినుంచి వెళ్ళిపోయాడు. తల దించుకొని అతని చిన్న కొడుకూ అన్నగారిని అనుసరించాడు.

ఆ తండ్రీ కొడుకుల మాటలు విన్నా నేను మొదలు నుంచి రెమ్మల వరకూ పులకించిపోయాను.

నాకే అవకాశం ఉంటే నా కొమ్మల్తో, రెమ్మల్తో, ఆకుల్తో అతని అణువణువునూ ప్రేమాతిశయంతో, కృతజ్ఞాభిమానంతో స్పృశించేదాన్ని.

నాకే గనక వీలు ఉంటే నా కొమ్మల్తో అతనికి పాదాభివందనం చేసి ఉండేదాన్ని!

నాకే గనక నో రుంటే ఆ వృద్ధ దంపతుల కట్టెలు కాల్చడానికి నా కట్టెల్నే వాడమని ఆ ఇద్దరి కొడుకులనూ చెప్పి ఉండేదాన్ని.

అవేమీ చేయలేని నేను అతని ఒడిలో పడేలా ఓ తీయని పండుని మాత్రం వదిలాను! ★